క్లుప్తంగా

శ్రీరామ పూజిత అక్షింతలు ఇంటింటికీ పంపిణీ

పెదపాడు: అయోధ్యలోని శ్రీరాముని పూజించిన అక్షింతలను రామభక్తులు ఆదివారం ఇంటింటికీ పంపిణీ చేసారు. విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో పెదపాడులో ఇంటింటా తిరుగుతూ శ్రీరాముని అక్షింతలను పంపిణీ చేశారు. జైశ్రీరామ్ అంటూ భగన్నామస్మరణ చేసుకుంటూ అందరికీ అక్షింతలు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో పెదపాడులోని వీరాంజనేయస్వామి ఆలయ అర్చకులు పరాంకుశం చక్రధర శ్రీనివాసాచార్యులు, రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ అర్చకుడు గ్రామస్తులు పాల్గొన్నారు.

చురుగ్గా శివాలయ నిర్మాణ పనులు

పెదపాడు: సత్యవోలులో శివాలయ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆలయ నిర్మాణ పనులు దాదాపు పూర్తి అయినప్పటికీ ప్రహరీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఆదివారం శివాలయ నిర్మాణ పనులను ఆలయ కమిటీ సభ్యులతో కలిసి బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులను అభినందించారు. దీంతో పాటు గ్రామంలోని రామాలయం అభివృద్ధి పనులపై ఆయన ఆరా తీశారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్మాణ పనులు చేపట్టేందుకు సీజీఎఫ్ నిధులు మంజూరు ఉత్తర్వులను గ్రామ పెద్దలకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, విశ్రాంత ఉపాధ్యాయుడు టంగుడు ఆంజనేయులు, సీనియర్ బీసీ నాయకుడు బొమ్మి ప్రభాకరరావు, కొట్నాన వెంకట్రావు, శ్రీను పాల్గొన్నారు.

శివాలయానికి నంది వాహనం సమర్పణ

భీమడోలు: భీమడోలులోని పార్వతీ సమేత భీమేశ్వర స్వామికి కురెళ్లగూడెంకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, దాత రావిపాటి గాంధీ గోపాలకృష్ణ ఆర్థిక సాయంతో సమకూర్చిన బల్లస్టాండ్ కలిగిన ఇత్తడి నంది వాహనాన్ని భోగి రోజైన ఆదివారం సమర్పించారు. ఆలయంలోని స్వామి వార్ల ప్రదక్షిణలు చేసేందుకు అవసరమైన 45 కేజీల గల ఇత్తడి నంది వాహనాన్ని రూ.65 వేలతో చేయించి ఆలయ పూజారి కాళ్లకూరి ఉమాశంకర్‌శర్మ, అభివృద్ధి కమిటీ నిర్వాహకులకు అందించారు. తొలుత ఆలయంలో స్వామి వార్లను దర్శించుకుని పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, దాత రావిపాటి గాంధీ గోపాలకృష్ణ, వారి మాతృమూర్తి గోపమ్మను దుశ్శాలువాలతో ఆలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. అనంతరం గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయానికి రూ.7,500 విలువ గల మంచినీటి నిల్వ ట్యాంకును రావిపాటి గాంధీ గోపాలకృష్ణ బహూకరించారు. తల్లి గోపమ్మ మంచినీటి కుళాయిను ప్రారంభించారు. పెద్దలు బొమ్ము గాంధీ, సుతాపల్లి ప్రసాద్, నాయకులు పున్నం గోపి, పూజారులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భోగి వేడుకలు

- ఉత్సాహంగా వీధుల్లో భోగి మంటలు
- బంధుమిత్రులతో సందడి వాతావరణం



ఏలూరులో భోగిమంట



ఏలూరులో సంక్రాంతి సంబరాల్లో హరిదాసులకు దానం చేస్తున్న యువతులు



ఏలూరులో సంక్రాంతి సంబరాల్లో భాగంగా మట్టి కుండల వద్ద యువతి సెల్ఫీ



ఏలూరులో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఎడ్లబండి ఎక్కిన చిన్నారులు



ఏలూరులో సంక్రాంతి సంబరాల్లో భాగంగా పూర్వకాలపు ఇంటి నమూనా వద్ద యువతులు

ఏలూరు రూరల్/ఏలూరు (ఆర్ఆర్‌పేట): సంక్రాంతి పండుగ సంబరాలు ఏలూరు నగరంలో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు భోగి సందర్భంగా ఆదివారం వీధుల్లోని కూడళ్లలో యువత, బాలబాలికలు పతంగులు ఎగుర వేస్తూ సందడి చేశారు. తెల్లవారు జామున 4 గంటలకు ఈ ప్రాంగణంలో బారీ భోగి మంటలు వేసి, భోగి పాటలు పాడుతూ ఉత్సాహంగా పండుగను ప్రారంభించారు. చిన్నారులు ఆ మంటల్లో భోగి దండలు వేసి పరవశించారు. బంధువులు, ఆడపడుచుల రాకతో ఇంటింటా సంక్రాంతి పండుగ వాతావరణం నెలకొంది. అతివలు తెల్లవారు జామున తమ ఇంటి ముంగిట రంగులతో ఆకట్టుకునేలా రంగవల్లులు తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా మహిళలు తమ చిన్నారులకు భోగిపండ్లు పోసే కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులకు పెద్దలు ఆశీర్వచనాలు అందజేశారు.

జోరుగా కోడి పందేలు

ఏలూరు రూరల్: ఏలూరు నగర పరిసరాలు, రూరల్ మండలంలోని గ్రామాల్లో కోడి పందేలు, జూద క్రీడలు ఆదివారం ప్రారంభమయ్యాయి. కొమడవోలు, చొదిమెళ్లతో పాటు జాలిపూడి, గుడివాకలంక, ప్రత్తికోళ్లలంక, పైడిచింతపాడు, శ్రీపర్రు కొల్లేరు గ్రామాల్లో ఉదయం 11 గంటల నుంచి కోడి పందేలు మొదలయ్యాయి. బరుల వద్ద పేకాట, గుండాట ఏర్పాటు చేసారు. నగర వాసులు పెద్ద ఎత్తున తరలివచ్చి కోడి పందేలను వీక్షించారు. చాటపర్రు, జాలిపూడిలో మహిళలు సైతం కోడిపందేలను చూసేందుకు తరలివచ్చారు.

మేధోశక్తి వృద్ధికి చెస్ పోటీలు దోహదం

ఏలూరు (టూటౌన్): చిన్నారుల్లో మేధోశక్తి వృద్ధి చెందేందుకు చెస్ పోటీలు దోహదం చేస్తాయని సీపీఎం జిల్లా క్యాదర్శి ఏ.రవి అన్నారు. డీవైఎఫ్ఐ సంక్రాంతి యువజన ఉత్సవాల్లో భాగంగా జిల్లా చెస్ ఓపెన్ టోర్నమెంట్లో గెలుపొందిన విజేతలకు ఆయన ఆదివారం బహుమతులను అందజేసారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.దుర్గాప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేటి విద్యావిధానంలో పిల్లలు ర్యాంకులు సాధించాలని ఒత్తిడి పెంచే విధంగా ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేసారు. విద్యార్థులకు విద్యతోపాటు శారీరక, మానసిక ఉల్లాసం కలిగించే ఆట పాటలను నేర్పించాలని అన్నారు. ప్రజా సంఘాలన్నీ కలిపి సంక్రాంతి సందర్భంగా ఇటువంటి ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఠాగూర్ రాజా, సీఐటీయూ నాయకులు పి.కిషోర్, చెస్ ఛీఫ్ ఆర్బిటర్ కృష్ణ కుమారి, కోచ్ డి.లక్ష్మణరావు, పి.హైమా తదితరులు మాట్లాడారు. సభ అనంతరం గెలుపొందిన విజేతలకు మెమెంటో, సర్టిఫికెట్, నగదు బహుమతులు ప్రదానం చేసారు. జిల్లా ఓపెన్ చెస్ టోర్నమెంటు చాంపియన్‌గా సూర్యనారాయణ గెలుపొందగా, తరువాతి స్థానాల్లో సోనాలి శ్రీ మణి కార్తీక, షణ్ముక సాయి, సీహెచ్ వివేక్, పి.సుచిత్ర నిలిచారు.



చెస్ పోటీల్లో గెలుపొందిన విజేతలతో నిర్వాహకులు

గోగుంట గ్రామస్తుల ఆత్మీయ కలయిక

పెదపాడు: మండలంలోని గోగుంటలో గ్రామానికి చెందిన ఆడపడుచులు, సోదరుల ఆత్మీయ కలయికతో పాటు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. గ్రామం నుంచి వలసవెళ్లి వివిధ ప్రదేశాల్లో స్థిరపడిన వారంతా ఆదివారం కలిశారు. గ్రామానికి చెందిన ఆడపడుచుల కుటుంబాల ఆత్మీయ కలయిక ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనేక మంది గ్రామస్తులు పాల్గొన్నా రు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. సంక్రాంతి ఆట పాటలతో సందడి చేశారు.

చలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరణ



చలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలూరు (టూటౌన్): ఈ నెల 19న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా నిర్వహించనున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి అందరూ తరలి రావాలని వైఎస్సార్ సీపీ నాయకులు పిలుపు నిచ్చారు. జాతీయ సీనియర్ ఎస్సీ నాయకులు పొలిమేర హరికృష్ణ రూపొందించిన చలో విజయవాడ పోస్టర్లను ఆదివారం నాయకులు ఆవిష్కరించారు. ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ బొద్దాని శ్రీనివాసరావు, ఏలూరు నగరపాలక సంస్థ కో–ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, ఏపీ మెడికల్ బోర్డు డైరెక్టర్ డాక్టర్ దిరిశాల వరప్రసాద్ పాల్గొన్నారు. సీఎం వైఎస్ జగన్‌కి రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై అమితమైన ప్రేమ, రాజ్యాంగంపై గౌరవం ఉందని వారన్నారు. పాకా ప్రభాకర రావు, సొంగా మధుసూదనరావు, పరిసిపోగు బాలరాజు, చింతాటి వెంకన్న పాల్గొన్నారు.

కనుల పండువగా గోదాదేవి కల్యాణ మహోత్సవం

అలరించిన సంగీత, నృత్య కార్యక్రమాలు



గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



కూచిపూడి నృత్య ప్రదర్శన



అగ్రహారంలోని జనార్దన స్వామి దేవస్థానంలో గోదా కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



పవర్ పేట కోదండ రామాలయంలో గోదా కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న స్వామి వారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ సాయంత్రం నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరిస్తున్నాయి. ఆదివారం సాయంత్రం 5 గంటలకు నగరానికి చెందిన వింజపురపు నవ్యశ్రీ బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. రాత్రి 7 గంటలకు గోదా రంగనాథ స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్ దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. గోదా కల్యాణ మహోత్సవ విశిష్టతను పలువురు సంగీత కళాకారులు తమ గీతాలతో అలరించారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించి అనంతరం శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణ చేశారు. ఉదయం 10 గంటలకు స్వామి వారి నిత్య కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేష అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. ఆలయ అర్చకులు కోసూరి సత్య నారాయణాచార్యులు విశేష పూజలు నిర్వహించగా ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ట్రస్టీలు భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసి రావు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

వైభవంగా గోదా కల్యాణం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని పలు వైష్ణవ ఆలయాల్లో ఆదివారం గోదా కల్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక అగ్రహారంలోని భూ నీళా సమేత జనార్థన స్వామి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం గోదా రంగనాయక స్వామి వార్ల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామి వారికి అమ్మవారికి ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కళ్యాణ మహోత్సవాన్ని కన్నులారా వీక్షించారు. కార్యనిర్వహణాధికారి గుబ్బల రామ పెద్దింట్ల రావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. స్థానిక పవర్ పేట వాసు దేవాలయంలో గోదా వాసుదేవ స్వామి వార్ల కల్యాణ మహోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి ఎం. రామాంజనేయులు కార్యక్రమాలు పర్యవేక్షించారు. వపర్ పేట బడేటి వారి వీధిలోని కోదండ రామాలయంలో ఉదయం 9 గంటలకు గోదా రంగనాయక స్వామి వార్ల కల్యాణ మహోత్సవం జవ్వాజి మోహన వెంకట ఆదిత్య, ప్రియాంక దంపతులు నిర్వహించారు. ట్రస్టీ జవ్వాజి మోహన్ విఠల్ పర్యవేక్షించారు.

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆటల పోటీలు

ఏలూరు (టూటౌన్): యువత చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా ఉండేందుకు సంక్రాంతి పండుగ సందర్భంగా డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏటా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పి.దుర్గాప్రసాద్ అన్నారు. భోగి పండుగ సందర్భంగా స్థానిక చోడిదిబ్బ ప్రాంతంలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఆటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా రాష్ట్ర వ్యాప్తంగా సంక్రాంతి యువజనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సంక్రాంతి అంటే కొంత మంది తమ స్వార్థ ప్రయోజనాల కోసం కోడిపందేలు, జూద క్రీడలను ప్రోత్సహించి యువతను చెడు దారి పట్టే విధంగా చేస్తున్నారని అన్నారు. వాటి నుంచి మంచి వైపు మరల్చే విధంగా గ్రామాల్లో సంప్రదాయ ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వి.ఠాగూర్ రాజా, స్థానిక పెద్దలు బొత్స సింహాచలం, శేఖర్, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



స్థానిక చోడిదిబ్బ ప్రాంతంలో ఆటల పోటీలో పాల్గొన్న చిన్నారులు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	30	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	52
వంకాయలు (కాంతులు)	20	బీన్సచిక్కుడు	80
వంకాయలు (తెలుపు)	--	చామదుంపలు	60
బెండకాయలు	40	ములక్కాడలు	10-15
పచ్చిమిర్చి	56	కంద	68
కాకర కాయలు	50	బీట్‌రూట్	34
బీరకాయలు	40	కీర దోస	34
బీరకాయలు (పందిరి)	56	ఫ్రెంచ్‌బీన్స్	64
క్యాబేజీ	20	అల్లం	128
క్యారెట్	60	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	24	పాలకూర	10
బంగాళదుంపలు	28	చుక్కకూర	10
ఉల్లిపాయలు	25-30	తోటకూర	10
గోరుచిక్కుడు	34	గోంగూర	08
దోసకాయలు	34-52	పుదీనా	05
ఆనపకాయ (1)	30-40	క్యాప్సికమ్	64
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	32

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	03
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	01
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	03
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	--

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	01
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	00
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	00
ద్వారకాతిరుమల -ఏలూరు- బీహెచ్‌ఈఎల్	22.15	4822	18
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	రద్దు
ఏలూరు -తిరుపతి	16.00	4830	రద్దు
డీ. తిరుమల - ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	36
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.40	98517	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.50	98501	37

ఆకట్టుకునేలా అంబేద్కర్ స్మృతి వనం

నిడమర్రు: విజయవాడ మైదానంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 125 అడుగుల భారీ విగ్రహాన్ని, స్మృతి వనాన్ని ఈ నెల 19న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్నారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఈ కార్యక్రమం విజయవంతానికి సంబంధించిన ముందస్తు సమీక్ష సమావేశం ఆదివారం బువ్వనపల్లిలో ఎమ్మెల్యే వాసుబాబు నిర్వహించారు. బీసీ, ఎస్సీ నేతలతో ఎమ్మెల్యే చర్చించారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ 200 ఎకరాల విస్తీర్ణంలో రూ.400 కోట్లతో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అందరినీ ఆకర్షించేలా అంబేడ్కర్ జీవిత చరిత్రను తెలిపేలా మ్యూజియం, మినీ థియేటర్, కన్వెన్షన్ సెంటర్, స్కైలైటింగ్, ఫౌంటెన్లు, గ్రంథాలయాలతో సర్వాంగ సుందరంగా అంబేడ్కర్ స్మృతి వనాన్ని తీర్చిదిద్దినట్లు తెలిపారు. నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి ఆలోచనలకు మద్దతు తెలుపుతూ భారీ ఎత్తున్న విజయవాడ తరలి రావాలని ఎమ్మెల్యే వాసుబాబు పిలుపు నిచ్చారు.

కొనసాగుతున్న గాలింపు

పెదవేగి : తోటికోడళ్ల అదృశ్యం ఘటనలో చిన్నకోడలు మృతదేహ కృష్ణా కాలువలో లభ్యం కాగా, పెద్దకోడలు ఆచూకీ లభించలేదు. వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం పినకడిమికి చెందిన రూపాదేవి, స్వాతికి అదే గ్రామానికి చెందిన సమీప బంధువులైన పాలపాటి కామరాజు, తిరుపతమ్మల కుమారులు శ్రీనివాస్, శివసాయితో వివాహమైంది. కొంతకాలం తరువాత నుంచి వరకట్నం వేధింపులు ప్రారంభమయ్యాయి.పెద్దలు సర్దిచెప్పిన అనంతరం వేధింపులు అధికమవడంతో శుక్రవారం మధ్యాహ్నం ఇద్దరు తోటికోడళ్లు రూపాదేవి, స్వాతి ఇంటి నుంచి వెళ్లిపోయారు. అక్కడి నుంచి విజయవాడ చేరుకున్న ఆ ఇద్దరు శనివారం మధ్యాహ్నం ఆత్మహత్యకు పాల్పడ్డారనే సమాచారంతో గ్రామం ఉలిక్కిపడింది. మహిళల పుట్టింటి బంధువర్గం, అత్తింటివారిపై దాడికి పాల్పడ్డారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పోలీసులు భారీగా మోహరించి, పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. స్వాతి (33) మృతదేహం శనివారం లభ్యమైంది, ఆదివారం పంచనామా, శవపరీక్ష నిర్వహించి, మృతదేహాన్ని బంధువులకు అప్పగించామని పెదవేగి ఎస్సై ఎంలక్ష్మణ్ తెలిపారు. మరో మహిళ రూపాదేవి ఆచూకీ తెలియరాలేదని, కృష్ణా కాలువలో గాలిస్తున్నామని ఆయన చెప్పారు. ఈ కేసులో నిందితులైన అత్తమామలు తిరుపతమ్మ, కామరాజును ఆదివారం అరెస్టు చేశామని ఎస్సై తెలిపారు. ఆ ఇదరి మహిళల భర్తలైన అన్నదమ్ములు శ్రీనివాస్, శివసాయి పరారీలో ఉన్నారని ఎస్సై వివరించారు.